## క్లుప్తంగా

### బెంతు ఒరియాలను ఎస్టీలుగా గుర్తించాలి

**సరుబుజ్జిలి:** బెంతు ఒరియాలను ఎస్టీలుగా గుర్తించాలని పాలవలస, పెద్దపాలెం పంచాయతీ సర్పంచ్‌లు గజ్జన మోహనరావు, సర్దరి గురువులునాయుడు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బమ్మిడి రమేష్‌కుమార్‌కు బెంతు ఒరియా కులస్తులతో కలిసి బుధవారం వినతి పత్రం అందించారు. బెంతు ఒరియాలను ఎస్టీలుగా గుర్తిస్తూ గతంలో ఎస్టీ ధ్రువపత్రాలు అందించేవారని, తదుపరి కొన్ని కారణాలతో అధికారులు కుల ధ్రువపత్రాలు మంజూరు చేయడం నిలిపేశారని తెలిపారు. దీనివల్ల తమ కులస్తులు అన్నిరంగాల్లో వెనుకబడ్డారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో మా రెండు పంచాయతీల్లో ఎస్టీ రిజర్వ్ వార్డులు కూడా ధ్రువీకరణ పత్రం లేక ఎన్నిక జరగలేదన్నారు.

### విద్యా సామర్థ్యాలు మరింత పెంచాలి



విద్యా సామర్థ్యాలను తెలుసుకుంటున్న డిప్యూటీ డీఈఓ పగడాలమ్మ

**కొత్తూరు:** విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంచాలని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాధికారి పగడాలమ్మ ఉపాధ్యాయులకు ఆదేశించారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థులు విద్యా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థుల నోట్‌బుక్‌లు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కొత్తూరు హెచ్‌ఎం గోవిందరావు, మెట్టూరు హెచ్‌ఎం డీఎల్ నరసింహం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

**సారవకోట:** మండలంలో నాడు–నేడు కార్యక్రమం ద్వారా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జి.జయదేవి సూచించారు. సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సారవకోట ప్రాజెక్టు పరిధిలోని సారవకోట మండలంలో సారవకోట-4, అలుదు-1 అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు-నేడు నిధులతో నూతన భవన నిర్మాణాలు మంజూరయ్యాయని, ఆ పనులు వేగవంతం చేయాలన్నారు. సీడీపీఓ హెచ్.కె.కామాక్షి ఉన్నారు.


### తప్పిన ప్రమాదం



ప్రమాద స్థలంలో ఉన్న లారీ

**కొత్తూరు:** మండల కేంద్రంలోని కాలేజీ రోడ్డులో గల ఏపీజీవీబీ సమీపంలో ఉన్న టిఫిన్ షాపు ముందు పార్కు చేసిన బైక్ పైనుంచి మంగళవారం రాత్రి లారీ దూసుకుపోయింది. శ్రీకాకుళం నుంచి కొత్తూరు వైపు వస్తుంది. బైక్ నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ రద్దీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బైక్ యజమాని శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.గోవింద తెలిపారు.

### వర్షానికి కూలిన ప్రహరీ



కూలిన ప్రహరీగోడ

**పొందూరు:** రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు కొంచాడ పంచాయతీ లుట్టపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలిపోయింది. మంగళవారం అర్ధరాత్రి ఘటన జరగడంతో ఎవరికీ ప్రమాదం కాలేదు. ఇప్పటికే పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో పైకప్పు పెచ్చులూడుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

### కేజీబీవీ సిబ్బందికి సత్కారం

**సారవకోట:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల సిబ్బందిని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఇటీవల యోగా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు విన్యాసాలకు గుర్తింపుగా సత్కరించారు. మండల ప్రత్యేకాధికారి వి.జయరాజ్, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, తహసీల్దార్ హనుమంతరావు, కేజీబీవీ ఎస్ఓ కర్ర సంతోషి పాల్గొన్నారు.

**ఎల్.ఎన్.పేట:** ఎంఈఓగా పనిచేసి కొత్తూరు మండలానికి బదిలీపై వెళ్లిన ఎస్.శ్రీనివాసరావును ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథు ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఎంఈఓ-2 చంద్రమౌళి, ఉపాధ్యాయులు గురుగుబెల్లి శ్రీరామచంద్రమూర్తి, జయరాం, పైడి రాజు, సుధాకర్, ఢిల్లేశ్వరావు, రామకృష్ణ, ఎంప్రసాదరావు పాల్గొన్నారు.

**నరసన్నపేట:** మండలం చోడవరం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన వంకిల అప్పారావును గ్రామస్తులు సత్కరించారు. సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు అంపోలు సుధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష పేదలకు వరం

ప్రజా సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ప్రభుత్వం ఉచితంగా 11 రకాల సేవలను ప్రజలకు అందజేస్తుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు మంజూరు చేశారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పొందూరు: తాడివలసలో ధ్రువపత్రాలను అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



నరసన్నపేట: దూకులపాడులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



మెళియాపుట్టి: వసుంధరలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, లబ్ధిదారులు



ఆమదాలవలస రూరల్: సైలాడలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



సరుబుజ్జిలి: పాలవలసలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఆమదాలవలస: వెంగళరావు కాలనీలో ధ్రువపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: గ్రామ సచివాలయం-1లో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పోలాకి: దీర్ఘాశిలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య

## రెవెన్యూ సిబ్బంది పనితీరుపై సభ్యుల ధ్వజం



పొజిషన్ సర్టిఫికెట్లపై ఏఈతో చర్చిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

**సారవకోట:** మండలం పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. పలువురు సర్పంచ్, ఎంపీటీసీలు గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరైన గృహాలకు పొజిషన్ సర్టిఫికెట్లను రెవెన్యూ శాఖ ద్వారా మంజూరు చేయడం లేదని ఆరోపించారు. గత సర్వసభ్య సమావేశంలో ఇదే అంశంపై సభ దృష్టికి తీసుకువచ్చామని, ఇప్పటివరకు పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరులో కొర్రీలు పెడుతున్నారన్నారు. త్వరలో ఈ–క్రాప్ నమోదు ప్రారంభం కానుందని, దానికి రెవెన్యూ సమస్యలు రాకుండా చూడాలని కొత్తూరు సర్పంచ్ బాడాన కృష్ణారావు కోరారు. అక్కివలస గ్రామానికి మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని సర్పంచ్ బమ్మిడి లక్ష్మి విన్నవించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న పనులు రైతులకు ఉపయోగంగా లేవని సభ్యులు ఆరోపించారు. స్టాప్ ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేయకుండా వెళ్తున్నాయని ఎంపీడీఓ విశ్వేశ్వరరావు సభకు హాజరైన ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సభ జరుగుతుండగా గృహ నిర్మాణ శాఖ ఏఈ ప్రసాదరావు ఎటువంటి అనుమతి తీసుకోకుండా బయటకు వెళ్తుండగా.. సభ పూర్తయ్యేంత వరకు సభలో ఉండాలని సభామర్యాదలు కాపాడాలని ఎంపీపీ సూచించారు. ప్రతీ సమావేశానికి వంశధార, అటవీశాఖ అధికారులు హాజరు కాకపోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. తహసీల్దార్ హనుమంతరావు, ప్రత్యేకాధికారి వి.జయరాజ్, పలువురు అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఈఓ వెంకట్రామన్

**కొత్తూరు:** బీఎల్‌ఓలు ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పరిషత్ సీఈఓ ఆర్.వెంకట్రామన్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని 77 మంది బీఎల్‌ఓలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఓటర్ల తొలగింపులో జిల్లాలోనే పాతపట్నం నియోజవర్గంలో 4.6 శాతంతో అత్యధికంగా ఉందన్నారు. ఇందులో కొత్తూరు మండలంలోని 219, 218, 220 పోలింగ్ బూత్‌ల పరిధిలో మరింత ఎక్కువ తొలగింపులు ఉన్నట్లు తెలిపారు. రెండు శాతం కంటే ఎక్కువ తొలగింపులు ఉంటే కారణాలు పక్కాగా ఉండాలన్నారు. మండలంలోని 52 బూత్‌లలో రెండు కంటే ఎక్కువ శాతం తొలగింపులు జరిగినట్లు గుర్తించామన్నారు. ఎక్కువ శాతం ఓటర్లను తొలగించిన బీఎల్‌ఓలు ఆధారాలతో నివేదికలు అందజేయాలన్నారు. ఈ నెల 21 నుంచి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు వంటి కార్యక్రమాలు చేయాలన్నారు. సూపర్ వైజర్లు ఎప్పటికప్పుడు బీఎల్‌ఓలతో సమీక్ష నిర్వహించాలన్నారు. విధుల్లో లలసత్వం వహించిన బీఎల్‌ఓలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. తహసీల్దార్ చక్రవర్తి, డీటీ వెంకటరావు, ఎలక్షన్ డీటీ ఎ.శైలజ, సూపర్‌వైజర్లు కృష్ణారావు, మార్కండేయరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

### పీఏసీఎస్ సిబ్బంది నిరసన

**పొందూరు:** రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి కేంద్రాలలో పెట్టుబడుల్లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్థానిక పీఏసీఎస్ ఉద్యోగులు పొందూరులోని డీసీసీబీ వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పీఏసీఎస్ ఉద్యోగులు రాజధాని అమరావతిలో చేపడుతున్న పోరాటానికి మద్దతుగా పొందూరులో నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని పొందూరు పీఏసీఎస్ సీఈఓ ఎర్నేని పాపినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ ఉద్యోగులు మద్దతు పలికారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన రమణమూర్తి

**హిరమండలం:** హిరమండలంలోని టాటా వాటర్ ప్లాంట్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతంపర గ్రామానికి చెందిన రెడ్డి రమణమూర్తి స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై హిరమండలం వస్తున్నారు. ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమైంది. ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు రమణమూర్తిని హిరమండలం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నారాయణ స్వామి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

**బూర్జ:** డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని దళిత డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలో గల ఉప్పినివలస గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించి అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ గ్రామాల్లో వివక్షకు గురతున్న డప్పు కళాకారులను ఆదుకోవాలన్నారు. 40 ఏళ్లు నిండిన వారికి రూ.5 వేల పింఛన్ మంజూరుచేయాలని, సాగు భూమి, నివాస స్థలం ఇవ్వాలన్నారు. బస్సుల్లో, రైల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలన్నారు. పాతపట్నంలో ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహించనున్న అధ్యాయన తరగతులకు హాజరుకావాలన్నారు. డప్పు కళాకారుల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- సబ్సిడీపై బియ్యం అమ్మకాల దుకాణాన్ని ప్రారంభించిన స్పీకర్ తమ్మినేని సీతారాం



సబ్సిడీపై బియ్యం అమ్మకాలను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

**ఆమదాలవలస:** పేదల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ సర్కార్ నిత్యం కృషిచేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస రైతు బజార్‌లో ప్రభుత్వ రాయితీతో కూడిన సన్న బియ్యం అమ్మకాల దుకాణాన్ని బుధవారం ప్రారంభించారు. సన్న బియ్యం కిలో రూ.48, సాధారణ బియ్యం కిలో రూ.35లకు ప్రభుత్వమే అందిస్తుందన్నారు. డీఎస్ఓ వెంకటరమణ, తహసీల్దార్ గణపతి, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, సచివాలయాల కో ఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.శ్యామ్‌ప్రసాద్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## అచ్చెన్నా.. సలహాలు ఇవ్వొద్దు



సత్యవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

**నరసన్నపేట:** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బుడితి సభలో మాట్లాడుతూ ప్రజలకు ఏ అవసరం వచ్చినా తన వద్దకు వస్తే పనులు చేసి పెడతానని చెప్పారు. మా నియోజకవర్గంలో నువ్వు చేసేదేమిటి.. మా పనులు మేము చేసుకోగలం.. నీ నియోజకవర్గం నువ్వు చూసుకో అచ్చెన్నా అని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని సత్యవరంలో రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసన్నపేట నుంచి నన్ను నాలుగు సార్లు గెలిపించారు. ఇంకోసారి గెలిపించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఉందని, ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం జగన్ పనిచేస్తున్నారని, ఇటువంటి ముఖ్యమంత్రిని వదులు కుంటే ప్రజలే నష్టపోతారన్నారు. సత్యవరం, దూకులపాడుల్లో రైతులకు పాస్ పుస్తకాల సమస్యలు ఉన్నట్లు ఎమ్మెల్యే దృష్టికి ఎంపీపీ ఆరంగి మురళి తీసుకువచ్చారు. అర్హులందరికీ పాస్ పుస్తకాలు, రీ సర్వే అనంతరం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పంగ బావాజీనాయుడు, రాజాపు అప్పన్న, కేసీహెచ్‌బీ గుప్త, చీపురు కృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలి

**సరుబుజ్జిలి:** బ్యాంకుల ద్వారా ముద్ర, పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ విభాగాల్లో పొందిన రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని జీవనోపాధిని మెరుగపరచుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.విద్యాసాగర్ తెలిపారు. ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాలకు చెందిన పలు మహిళా సంఘాల నుంచి ఎంపిక చేసిన 310 మంది మహిళలకు మెగా లోన్ మేళాపై స్థానిక వైకేపీ కార్యాలయం ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళాసంఘాల సభ్యులకు పిండి, పప్పు మిల్లులు, డెయిరీ, వెల్డింగ్, ఫొటోగ్రఫీ, సెంట్రింగ్, సామిల్లులు తదితర యూనిట్లపై రుణాలు అందించేందుకు వెసులుబాటు ఉన్నట్లు 3 మండలాల బ్యాంకు మేనేజర్లు వెల్లడించారు. ఈసందర్భంగా మహిళల నుంచి రుణ దరఖాస్తులు స్వీకరించారు. డీపీఎంఏ నాగలక్ష్మి, వైకేపీ ఏపీఎంలు కమలకుమారి పాండ్యన్, బాబూరావు, రవిరాజ్, సీసీలు పాల్గొన్నారు.

## సబ్సిడీపై విత్తనాల పంపిణీ

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**పాతపట్నం:** ప్రకృతి వ్యవసాయంపై సాగు చేస్తున్న ఎస్సీ రైతులకు వివిధ రకాల విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతులకు విత్తనాలను అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ గడ్డెమ్మ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 117 మంది ఎస్సీ రైతులకు 12 రకాల విత్తనాలను అందజేశామన్నారు. జిల్లాలో 390 మంది ఎస్సీ రైతులు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.39లక్షలు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందజేస్తున్నామన్నారు. అనంతరం పీఎండీఎస్ కిట్లును ఎస్సీ రైతులకు అందజేశారు. డీపీఎం రేవతి, ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఏఎంసీ చైర్మన్ అర్జునరావు, వైస్ ఎంపీపీ ప్రదీప్, గెదెల సూర్యం, బెనియా వెంకటరమణ, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల ఏఓలు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదుపై ఇంటింటా సర్వే



సారవకోట: బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్‌ఓ జయదేవి

**సారవకోట:** ఓటర్ల నమోదుపై ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటా సర్వే పక్కాగా చేపట్టాలని నరసన్నపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.జయదేవి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్క గృహాన్ని సందర్శించి శాశ్వతంగా వలసలు వెళ్లిన, మృతి చెందిన ఓటర్లను తొలగించాలని, 18 ఏళ్లు నిండిన వారికి కొత్తగా ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ఓటర్ల చేర్పులు, మార్పులపై వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలన్నారు. తహసీల్దార్ హనుమంతరావు ఉన్నారు.

**జలుమూరు:** అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చాలని ఇందులో అలసత్వం వహిస్తే బూత్ లెవెల్ అధికారులపై చర్యలు తప్పవని నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.జయదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్వోలతో మాట్లాడారు. వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డబుల్ ఎంట్రీలు తీసివేయాలన్నారు. తహసీల్దార్ బి.సత్యం, అధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- స్పీకర్ తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి



ఆమదాలవలస: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

**ఆమదాలవలస:** సీఎం వై.ఎస్.జగన్‌హన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాలిటీలో 5వ వార్డు అక్కివలసలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్లలో ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరిస్తూ సమస్యలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ప్రజలు సీసీ రోడ్డులు, మురికి కాలువలు నిర్మాణాలు చేపట్టాలని స్పీకర్ దృష్టికి తీసువచ్చారు. వీటి పరిష్కారానికి అధికారులతో స్పీకర్ అక్కడే మాట్లాడి త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రవిసుధాకర్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీను, పార్టీ నాయకులు చెంచుల యర్రయ్య, సిమ్మ నాగరాజు, లబ్బ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపద్మాపురం గ్రామంలో..**



మెళియాపుట్టి: పెద్దపద్మాపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**మెళియాపుట్టి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని పెద్దపద్మాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు అందించిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, ఎంపీటీసీ హంసమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయ్‌కుమార్, యోగి, సంజీవరావు, తేజేశ్వరరావు, జయమునిరావు తదితరులు పాల్గొన్నారు.